# ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించాలి

## మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి




**విశ్వంభర, ఇబ్రహీంపట్నం:** తుర్కయాంజల్ బ్రాహ్మణపల్లి చౌరస్తాలో నూతనంగా ఏర్పాటు చేసిన తారా మల్టీస్పెషాలిటీ చిల్డ్రన్స్ ఆసుపత్రిని తెలంగాణ రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ప్రారంభించారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో మల్కాజిగిరి ఎంపీ ఈటెల రాజేందర్, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్, అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ, కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి, తాండూర్ ఎమ్మెల్యే మనోహర్ రెడ్డి, రోడ్స్ కార్పొరేషన్ చైర్మన్ మల్ రెడ్డి రాంరెడ్డి, ఎమ్మెల్సీలు గోరేటి వెంకన్న, ఎలిగంటి సత్యం, సీపీఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్ రెడ్డి, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు టి.సాగర్, డి.జి.నర్సింహారావు, ఐద్వా రాష్ట్ర కార్యదర్శి మల్లు లక్ష్మి తదితరులు పాల్గొని రిబ్బన్ కట్ చేసి వివిధ విభాగాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రజలకు అత్యాధునిక వైద్య సేవలు అందించే లక్ష్యంతో తుర్కయాంజల్ లో తారా ఆసుపత్రిని ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. పేద ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించి, లాభాపేక్షతో కాకుండా సేవా గుణంతో వైద్యం చేయాలని సూచించారు. ఆసుపత్రి యాజమాన్యం మాట్లాడుతూ.. "సామాన్య ప్రజలకు అందుబాటు ధరలో నాణ్యమైన వైద్యం అందించడమే మా ప్రధాన లక్ష్యం. ఇబ్రహీంపట్నం, దేవరకొండ, కల్వకుర్తి, మునుగోడు, అచ్చంపేట నియోజకవర్గాల ప్రజలకు మా ఆసుపత్రి అందుబాటులో ఉంటుంది. తారా మల్టీస్పెషాలిటీ ద్వారా ప్రతి ఒక్కరికీ మెరుగైన ఆరోగ్య సేవలు అందించి ఈ ప్రాంత ప్రజల ఆరోగ్యానికి భరోసా ఇస్తాము" అని తెలిపారు. ఈ ఆసుపత్రిలో జనరల్ మెడిసిన్, గైనకాలజీ, ఆర్థోపెడిక్, పీడియాట్రిక్స్, కార్డియాలజీ, జనరల్ సర్జరీ, అనస్తీషియా వంటి అన్ని ప్రధాన విభాగాలు అందుబాటులో ఉంటాయని, అనుభవజ్ఞులైన వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, అత్యాధునిక పరికరాలతో 24/7 అత్యవసర సేవలు, ల్యాబ్, ఫార్మసీ, సిటీ స్కాన్, ఇన్-పేషెంట్ సేవలు అందిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి యాజమాన్యం డాక్టర్లు తరుణ్ తేజ్, సంతోష్ వర్మ, ఐశ్వర్య, లక్ష్మణ్ రెడ్డి, శ్రవణ్ కుమార్, మాలోత్ రాజు, సుధాకర్ రెడ్డి, లహరి తిరుణగరి, అలేఖ్య రెడ్డి, శృతి తదితర సిబ్బంది పాల్గొన్నారు.

# రామన్ హైస్కూల్లో ఘనంగా బతుకమ్మ సంబరాలు




**విశ్వంభర, హనుమకొండ :** తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ ప్రతి ఆడపడుచుకు ఎంతో ప్రత్యేకమైనదని, తెలంగాణ మహిళలు భక్తిశ్రద్ధలతో, ఆనందోత్సా హాలతో జరుపుకునే ఈ పండుగ మన సాంస్కృతిక వారసత్వానికి ప్రతిబింబమని టిపిసిసి రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ అన్నారు. హనుమకొండ లో శుక్రవారం రామన్ హై స్కూల్ లో నిర్వహించిన బతుకమ్మ సంబరాలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు విద్యార్థి దశ నుంచే తమ హక్కులు, బాధ్యతలపై అవగాహన పెంపొందించుకోవాలని, జీవితంలో ఎదురయ్యే సవాళ్లను ధైర్యంగా ఎదుర్కొంటూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. బతుకమ్మ తెలంగాణ సంప్రదాయాలకు ప్రతీక మాత్రమే కాకుండా మహిళల ఐక్యతకు, ఆత్మీయతకు, సామాజిక సమైక్యతకు నిదర్శనమని పేర్కొన్నారు. రామన్ హై స్కూల్ కరస్పాండెంట్ రాజేష్, డైరెక్టర్ పురుషోత్తం మాట్లాడుతూ బతుకమ్మ సంబరాలు నిర్వహించడం ఎంతో ఆనందదాయకమని అన్నారు. మహిళలందరూ ఒకచోట చేరి, బతుకమ్మలను పేర్చి, ఆటపాటలతో ఆనందంగా జరుపుకునే ఈ పండుగ తెలంగాణ సంస్కృతికి ప్రత్యేక గుర్తింపునిస్తుందని పేర్కొన్నారు. ఇలాంటి పండుగలు ప్రజల మధ్య స్నేహభావాన్ని, ఐక్యతను పెంపొందించడంతోపాటు మన సంప్రదాయాలను కాపాడేందుకు దోహదపడతాయని తెలిపారు. రామన్ హై స్కూల్ డైరెక్టర్ పురుషోత్తం మాట్లాడుతూ తెలంగాణ మహిళలు బతుకమ్మ పండుగను ఎంతో భక్తిశ్రద్ధలతో, సంప్రదాయబద్ధంగా జరుపుకుంటారని అన్నారు. ఈ కార్యక్రమంలో రామన్ హై స్కూల్ ఉపాధ్యాయిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

# రీ సర్వేతో భూ సమస్యలకు పరిష్కారం:ఆర్డీఓ శ్రీనివాస్ రెడ్డి



**విశ్వంభర, ఇబ్రహీంపట్నం:** రంగారెడ్డి జిల్లా, ఇబ్రహీంపట్నం మండలం, రాందాస్ పల్లి గ్రామంలో భూ రికార్డుల రీ సర్వే ప్రక్రియపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో గ్రామసభ, అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఆర్డీఓ శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్ సునీత రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా అధికారులు రీ సర్వే ఉద్దేశం, చేపట్టే దశలు, భూ హద్దుల నిర్ధారణ, రికార్డుల పరిశీలన, అభ్యంతరాల స్వీకరణ తదితర అంశాలను గ్రామస్థులకు వివరించారు. రీ సర్వే ద్వారా భూముల వాస్తవ పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, పాత రికార్డులను నవీకరించడంతో పాటు భూ యజమానులకు స్పష్టమైన హక్కు వివరాలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఆర్డీఓ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. సర్వే సమయంలో భూ యజమానులు తమ భూములకు సంబంధించిన పట్టాదారు పాస్ బుక్, రిజిస్ట్రేషన్ పత్రాలు, వారసత్వ ధ్రువపత్రాలు, ఆధార్ తదితర పత్రాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. సర్వే బృందాలు గ్రామంలో పర్యటించే సమయంలో యజమానులు తప్పనిసరిగా హాజరై తమ భూముల హద్దులను చూపించాలని, పొరుగు రైతులతో సమన్వయం చేసుకోవాలని కోరారు. సర్వే వివరాల్లో తప్పులు, అభ్యంతరాలు ఉంటే నిర్ణీత గడువులో లిఖితపూర్వకంగా తెలియజేయాలని, తప్పుడు సమాచారం ఇవ్వడం, అనధికారికంగా హద్దులు మార్చడం వంటి చర్యలకు పాల్పడవద్దని హెచ్చరించారు. రీ సర్వే ప్రక్రియలో పారదర్శకత పాటిస్తామని, భవిష్యత్తులో భూ వివాదాలు తగ్గే అవకాశం ఉందని వివరించారు. ఈ కార్యక్రమంలో డీఐ, మండల సర్వేయర్ పాండురంగారెడ్డి, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మాధవి, జీపీఓ సుదర్శన్, లైసెన్స్ సర్వేయర్లు, ఇతర అధికారులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# బతుకమ్మలతో.. పాఠశాల ప్రాంగణం కళకళ!







**విశ్వంభర,**చౌటుప్పల్: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ పండుగ ప్రతీకగా నిలుస్తుందని మున్సిపల్ చైర్మన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ అన్నారు. శుక్రవారం చౌటుప్పల్ మున్సిపాలిటీ కేంద్రంలోని కృష్ణవేణి పాఠశాలలో నిర్వహించిన బతుకమ్మ సంబరాలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థినులు వివిధ రకాల పూలతో అందంగా బతుకమ్మలను పేర్చి, ఉత్సాహంగా వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా పావని రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మీయతకు, ప్రకృతిపై ప్రేమకు ప్రతీక అని అన్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. విద్యార్థి దశ నుంచే పండుగల విశిష్టతను తెలుసుకోవడంతోపాటు, సంప్రదాయాల పట్ల గౌరవం పెంపొందించుకోవాలని సూచించారు. పాఠశాల కరస్పాండెంట్ గుత్తా గోపాల్‌రెడ్డి కవిత మాట్లాడుతూ.. విద్యతోపాటు విద్యార్థుల్లో సాంస్కృతిక విలువలను పెంపొందించేందుకు ఇలాంటి వేడుకలు నిర్వహిస్తున్నామని తెలిపారు. బతుకమ్మ పండుగ విశిష్టతను విద్యార్థినులకు తెలియజేస్తూ, మన సంప్రదాయాలను కాపాడుకోవాలనే భావనను వారిలో పెంపొందిస్తున్నామన్నారు. విద్యార్థినులు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, పాటలు పాడుతూ వేడుకల్లో సందడి చేశారు. పూలతో అలంకరించిన బతుకమ్మలతో పాఠశాల ప్రాంగణం కళకళలాడింది. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ఉయ్యాల రమేష్ మరియు అధ్యాపక బృందం విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఉద్యమకారులకు న్యాయం చేయాలి : సుల్తాన్ యాదగిరి



**విశ్వంభర, ఖైరతాబాద్ :** తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న అర్హులైన ప్రతి ఉద్యమకారుడికి గుర్తింపు కల్పించి న్యాయం చేయాలని టీయూజాక్ రాష్ట్ర అధ్యక్షుడు సుల్తాన్ యాదవ్ ప్రభుత్వాన్ని కోరారు. గుర్తింపు ప్రక్రియలో సంఖ్యలకే పరిమితం కాకుండా, అర్హులెవరూ నష్టపోకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా హైదరాబాద్ అసెంబ్లీ ఎదురుగా ఉన్న గన్‌పార్క్ అమర వీరుల స్థూపం వద్ద తెలంగాణ ఉద్యమకారుల జాయింట్ యాక్షన్ కమిటీ (టీయూజాక్) ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. ఉద్యమకారుల గుర్తింపు కమిటీ సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ కే. రాములు నాయక్, మోతే శోభన్ రెడ్డి కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉద్యమకారుల గుర్తింపు కోసం యాప్ విడుదల చేసిన నేపథ్యంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కమిటీ సభ్యులు కోరారు. గుర్తింపు ప్రక్రియలో ఆలస్యమైనా ఎవరూ నష్టపోకుండా చూడాలని, అర్హులందరికీ న్యాయం జరిగే వరకు కమిటీ కృషి చేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో పాండు గౌడ్, గజం యాదగిరి, మోత్కూరి మల్లేశ్, జాంబవ్, బి.వి. దావరి, రమణ, విజయ్, అశైలం, కర్నె లక్ష్మీదావరి, లావణ్య, స్వప్న, సుగుణ, శ్రీలత, అరుణ, రమిందర్, లక్ష్మీపతి, సతీష్, వెంకటేశ్వర్లు, నాగుల్‌మీరా, శంకర్, పద్మ, క్రిష్ట, గిరి పాల్గొన్నారు.

## ఆచార్య ముదిగొండ శివప్రసాద్‌కు నివాళులు



**విశ్వంభర, అంబర్‌పేట :** ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు విభాగం మాజీ అధిపతి, ప్రముఖ రచయిత ఆచార్య ముదిగొండ శివప్రసాద్ మృతి పట్ల మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. హైదరాబాద్ అంబర్‌పేటలో శివప్రసాద్ పార్థివ దేహానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం ఆయన కుమారుడు ముదిగొండ ఇందుశేఖర్‌తో పాటు కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ సందర్భంగా బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ ఆచార్య ముదిగొండ శివప్రసాద్ గొప్ప పండితుడు, వ్యాసకర్త, సాహితీవేత్త, ఆధ్యాత్మికవేత్త అని కొనియాడారు. భారతదేశ అసలైన చరిత్రను నవలల రూపంలో తెలుగు ప్రజలకు అందించి, తెలుగు సాహిత్యానికి ఎనలేని సేవలు అందించారని పేర్కొన్నారు. ఆయన మరణం సాహితీ లోకానికి తీరని లోటని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జాతీయ నాయకుడు పి. మురళీధర్‌రావు, రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రామచంద్రరావు, ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎన్. గౌతంరావు, రమేష్ యాదవ్, అజయ్ కుమార్, చుక్క జగన్, దత్తు ముదిరాజ్, నాగరాజ్ చారి, లలితా నందరాజు గౌడ్ తదితరులు పాల్గొని నివాళులర్పించారు.

## కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శిగా లింగస్వామి యాదవ్



**విశ్వంభర,**చౌటుప్పల్: మున్సి పల్ పరిధిలోని లింగోజీ గూడెం గ్రామానికి చెందిన ఎర్ర గోని లింగస్వామి యాదవ్‌ను చౌటు ప్పల్ మున్సిపల్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమిం చారు. ఈ మేరకు ప్రభుత్వ విప్, డీసీసీ అధ్యక్షులు బీర్ల ఐలయ్య నియా మక ఉత్తర్వులు జారీ చేశారు. పార్టీ కోసం లింగస్వామి యాదవ్ చేసిన కృషిని గుర్తించి, ఆయనకు ఈ బాధ్యతలు అప్పగించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ప్రధాన కార్యదర్శిగా నియమించినందుకు మునుగోడు ఎమ్మెల్యే కోమ టిరెడ్డి రాజగోపాల్‌రెడ్డితో పాటు పార్టీ పెద్దలు, నాయకులకు లింగస్వామి యాదవ్ కృతజ్ఞతలు తెలిపారు.

## బతుకమ్మ సంబరం.. జేబీఎంలో పూల సందడి!



**విశ్వంభర,**చౌటుప్పల్: తెలంగాణ సంస్కృతి, సంప్రదా యాలకు ప్రతీకగా నిలిచే బతు కమ్మ పండుగను చౌటుప్పల్ మున్సిపల్ కేంద్రంలోని జేబీఎం ఒకేషనల్ జూనియర్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. విద్యా ర్థి నులు సంప్రదాయ దుస్తుల్లో బతుకమ్మలను పేర్చి, ఆటపాట లతో సందడి చేశారు. పూల పండుగ వేడుకలతో కళాశాల ప్రాంగణం సందడిగా మారింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ మాట్లాడుతూ.. బతుకమ్మ తెలం గాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని పేర్కొన్నారు. ఇలాంటి వేడుకలతో విద్యార్థుల్లో మన సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన పెరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్‌ను కళాశాల ప్రిన్సిపాల్ గంగాపురం జంగయ్య, కరస్పాండెంట్ గంగాపురం నిర్మల ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మాధవి, రంజిత్, యువరాజు, జ్యోతి, సుష్మ, మమత తదితరులు పాల్గొన్నారు.

## లిటిల్ చాంపియన్స్ స్కూల్ లో ఘనంగా బతుకమ్మ సంబరాలు




**విశ్వంభర, గుర్రంపోడు:**గుర్రంపోడ్ లోని లిటిల్ చాంపియన్స్ స్కూల్ లో శుక్రవారం ముందస్తు బతు కమ్మ సంబరాలు అంబరాన్ని అం టాయి. పాఠశాల విద్యార్థులు మహి ళలు మరియు ఉపాధ్యాయి నిలు బతుకమ్మలు పేర్చి ఆడి పా డారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పిల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ ఆడబిడ్డల ఆత్మ గౌరవ పండుగ బతుకమ్మ అని, మన తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు నిలయమని అన్నారు. బతుకమ్మ పండుగను ముందస్తుగా మా పాఠశాలలో జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ రొండి వెంకన్న, ఇంచార్జి కడారి స్వామి, విజయ్ మరియు ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు బండారు ఉపేందర్, రాజు, హరీష్, సుమన్, పరిమళ, చంద్రకళ, షబానా, సొనాలి, శిల్ప, అఖిల, సొనాలి, తపస్విని, సుబి, నైసి, లోరా థామస్, నీలిమ, దివ్య పాల్గొన్నారు.

## తాగునీటిని వృథా చేయొద్దు: సర్పంచ్ నవీన్



**విశ్వంభర, మహేశ్వరం:** రాబోయే వేసవిలో తాగునీటి కొరత తలెత్తకుండా ప్రజలు నీటిని పొదుపుగా వినియోగించాలని మహేశ్వరం సర్పంచ్ మునగపాటి నవీన్ సూచించారు. గ్రామ పంచాయతీ సాధారణ సమావేశంలో నీటి సమస్యలపై చర్చించి, నీటి వృథాను అరికట్టేందుకు వాటర్‌మెన్‌లకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ప్రతి ఇంటికి నీటి కుళాయిలు బిగించుకోవాలని, నిబంధనలు పాటించని ఇళ్లపై జరిమానాలు విధిస్తామని హెచ్చరించారు. గ్రామ అభివృద్ధికి ప్రజలు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఉపసర్పంచ్ జొరల రమేశ్, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించాలి



**విశ్వంభర, జూలూరుపాడు:** వార్షిక తనిఖీలో భాగంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు జూలూరుపాడు పోలీస్ స్టేషన్ నిర్వహణ సిబ్బంది పనితీరు, నేరాల నియంత్రణ, కేసుల దర్యాప్తుల పురోగతిని సమీక్షించారు. అనంతరం స్టేషన్ పరిసరాలను పరిశీలించి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచిన పేర్కొన్నారు. వివిధ సమస్యలతో వచ్చే బాధితులతో మర్యాదగా వ్యవహరించాలని సిబ్బందిని సూచించారు. అనంతరం పోలీస్ స్టేషన్లో నమోదైన యుఐ కేసులు గ్రేవ్ కేసులు ప్రాపర్టీ కేసులు వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలీస్ స్టేషన్ పరిధిలో అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు గంజాయి అక్రమ రవాణా వినియోగంపై ప్రత్యేక దృష్టి సారించి యువత మదకద్రవేల బారిన పడకుండా విస్తృతంగా అవగాహన కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిఎస్పి ఆదినారాయణ, సిఐ శ్రీలక్ష్మి, ఎస్సై జన్నత్ కుమార్, మనిషా, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా గ్యార్మి షరీఫ్ ఉత్సవాలు



**విశ్వంభర, మహబూబాబాద్:** మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డు బేతోలు గ్రామంలో గ్యార్మి షరీఫ్, హజ్రత్ మహబూబ్ సుభాని దర్గా 13వ కందిల్ ఉర్సు ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముస్లిం సోదరులు, భక్తులు జెండాలు, చాదర్, సందల్‌తో గ్రామ వీధుల్లో ఊరేగింపు నిర్వహించి దర్గాల వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. శనివారం దర్గా వద్ద ఫాతిహా నిర్వహించడంతో పాటు భక్తులకు భారీ అన్నదానం ఏర్పాటు చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ వేడుకల్లో మత పెద్దలు, కమిటీ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ పాదయాత్ర



**విశ్వంభర, అంబర్‌పేట :** హైదరాబాద్ అంబర్‌పేట్‌లో ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ సుమారు 100 మంది ప్రభుత్వ అధికారులు, సిబ్బందితో కలిసి పాదయాత్ర నిర్వహించారు. బస్తీలు, వీధుల్లో ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అక్కడికక్కడే పరిష్కారమయ్యే సమస్యలపై చర్యలు తీసుకోవాలని, మిగతా సమస్యలను కూడా పరిష్కరించాలని అధికారులకు సూచించారు.